**మంచిమాట**
దేవాలయాలలో విగ్రహాలలోకాక
నిరుపేదలలో బలహీనులలో
ఆపన్నులలో భగవంతుడిని
దర్శించేవారంటేనే దేవుడికి ఇష్టం.
సాటిమనిషికి సాయం చేయనివాడు
భగవంతుడిని బంగారుపూలతో
పూజించినా వ్యర్థమే.

RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే
MEDAK TODAY
తెలుగు దిన పత్రిక...

మంగళవారం, 03 మార్చి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 04 | సంచిక 105

# రాజ్యసభ సభ్యుల ఎంపికపై కీలక చర్చ

# తెరపైకి పలువురి పేర్లు

- రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్.. కీలక తేదీలు:
- నోటిఫికేషన్ విడుదల: ఫిబ్రవరి 26.
- నామినేషన్ల దాఖలు చేసే చివరి తేదీ: మార్చి 5.
- నామినేషన్ల పరిశీలన: మార్చి 6.
- నామినేషన్ల ఉపసంహరణ చివరి తేదీ: మార్చి 9.
- పోలింగ్: మార్చి 16, 2026 (ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు)
- ఓట్ల లెక్కింపు: మార్చి 16, 2026 సాయంత్రం 5 గంటలకు (పోలింగ్ ముగిసిన వెంటనే అనంతరం గెలిచిన అభ్యర్థుల ప్రకటన)



**వికారాబాద్, మార్చి 02:** వికారాబాద్ వేదికగా జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై పార్టీ అగ్రనేతలు మధ్య సోమవారం కీలక చర్చ జరిగింది. సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నేతలను పార్టీ అగ్రనేతలు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయని బలమైన నేతలకు ఈ సీట్లు కేటాయించాలనే అంశంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. ఎంపీల రేసులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య పేర్లను ఈ సందర్భంగా వారు ప్రస్తావించినట్లు తెలుస్తోంది.రెండు రోజుల్లో రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించేలా పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. . సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నేతలను పార్టీ అగ్రనేతలు సూచించారు. ఈ రాజ్యసభ సభ్యుల ఎంపికపై జరిగిన చర్చలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీని తమిళనాడు నుంచి రాజ్యసభకు పంపేందుకు తెలంగాణ నేతలు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.ఇంతకీ రాజ్యసభ ఎన్నికలు ఎప్పుడూ..?2026, ఫిబ్రవరి 18వ తేదీన రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. 10 రాష్ట్రాల్లోని మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఈ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఆ జాబితాలో తెలంగాణ నుంచి 2 స్థానాలు ఖాళీ కానున్నాయి. బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ పదవులు ముగియనున్నాయి. వీరి పదవి కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీల ఎన్నిక అనివార్యమైంది.

## ఇరాన్- ఇజ్రాయెల్ సంక్షోభం

### దుబాయిలో ఇరుక్కుపోయిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**హైదరాబాద్ :** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నేపథ్యంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. తన కుటుంబసభ్యుల చికిత్స కోసం దుబాయ్ వెళ్లిన ఆయన.. విమానాల రద్దుతో అక్కడే ఇరుక్కుపో యారు.ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి తర్వాత గల్ఫ్ దేశాల్లో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ప్రతీకారం తీర్చుకునేందుకు ఇజ్రాయెల్, పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడుతున్నది. యూఏఈ, కువైట్, ఖతార్, బహ్రెయిన్, ఇరాక్ దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలతోపాటు విమానాశ్రయాలు, ఇతర సముదాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ క్షిపణుల దాడి చేస్తున్నది. ఈ క్రమంలో దుబాయ్‌లోని ఎయిర్‌పోర్టుల్ని మూసివేశారు. ఫలితంగా విమాన రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే తన బంధువులను పరామర్శించేందుకు వెళ్లిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్కడే చిక్కుకుపోయారు.తన కుటుంబసభ్యుల్లో ఒకరికి అనారోగ్య కారణాల రీత్యా చికిత్స కోసం ఐదు రోజుల క్రితం తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌కు వెళ్లారు. ఇంతలోనే దుబాయ్‌పై ఇరాన్ దాడులు చేస్తుండటంతో అక్కడి ప్రభుత్వం అన్ని విమానాలను రద్దుచేసింది. దీంతో దుబాయ్‌లో సురక్షితంగానే ఉన్నప్పటికీ, ఎయిర్‌పోర్టు క్లియరెన్స్ ఇచ్చేంత వరకు ఇండియాకు తిరిగిరాలేని పరిస్థితి నెలకొంది.


# రాహుల్‌ని ప్రధాని చేయడమే లక్ష్యం



**వికారాబాద్, మార్చి 02:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు.ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు.తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఈపీసెట్

### దరఖాస్తుల గడువు పొడిగింపు




**అమరావతి :** ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఈఏపీసెట్ దరఖాస్తులు సమర్పించేందుకు గడువును పొడిగిస్తున్నట్లు కన్వీనర్ ఎన్ మోహన్‌రావు వెల్లడించారు. ఆలస్యరుసుము లేకుండా ఆన్‌లైన్ లో మార్చి 17 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ.వెయ్యితో మార్చి 21, రూ.2 వేలతో మార్చి 25, రూ.4 వేలతో మార్చి 30, రూ.10 వేలతో ఏప్రిల్ 3 వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఏప్రిల్ 4-6 వరకు అవకాశం కల్పించారు. పరీక్షల నిర్వహణ తేదీల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని తెలిపారు.

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కార్యాలయంపై

# ఇరాన్ దాడి



**ఇరాన్ :** ఇజ్రాయెల్- అమెరికా కలిసి ఇరాన్ పై దాడులు చేయడంతో పశ్చిమాసి యాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందారు. దీంతో ఇరాన్ ప్రతికార దాడులకు దిగింది. ఇజ్రాయెల్?తో పాటు అమెరికా స్థావరాలు ఉన్న దేశాలపై దాడులు చేస్తోంది. సోమవారం పశ్చియాసియాలో దాడులు కొనసాగుతున్నాయి.ఇరాన్ గూఢచర్య విభాగం అధిపతి జలాల్ పోర్ హుస్సేన్ మృతిఇరాన్ నిఘా మంత్రిత్వశాఖలో ఇద్దరు సీనియర్ అధికారులు మృతిఇద్దరు సీనియర్ అధికారులను చంపినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు ట్వీట్ ఇరాన్ నిఘా శాఖ సహాయ మంత్రి సయ్యద్ యాహ్యా హమీద్ మృతి ఇరాన్ గూఢచర్య విభాగం అధిపతి జలాల్ పోర్ హుస్సేన్ మృతి ఇరాన్ గూఢచర్య విభాగం అధిపతి జలాల్ పోర్ హుస్సేన్ మృతి ఇరాన్ నిఘా మంత్రిత్వశాఖలో ఇద్దరు సీనియర్ అధికారులు మృతి ఇద్దరు సీనియర్ అధికారులను చంపినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు ట్వీట్ఇరాన్ నిఘా శాఖ సహాయ మంత్రి సయ్యద్ యాహ్యా హమీద్ మృతి ఇరాన్ గూఢచర్య విభాగం అధిపతి జలాల్ పోర్ హుస్సేన్ మృతి ఇరాన్‌లో ఇప్పటి వరకు 555 మంది మృతిఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులుకనీసం 555 మంది మరణించినట్లు ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ వెల్లడి ఈ యుద్ధంలో ఇప్పటివరకు 131 నగరాలపై దాడులు జరిగాయని పేర్కొన్న సంస్థఅమెరికా--ఇజ్రాయెల్ సైన్యం తమ దేశంలోని నతాంజ్ యురేనియం శుద్ధి కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని ఇరాన్ ఆరోపించింది. నతాంజ్ యురేనియం శుద్ధి కేంద్రంపై బాంబు దాడులు జరిగాయని చెప్పింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షణ సంస్థకు ఇరాన్ రాయబారి ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను సమర్థించే ఆధారాలు ఇప్పటివరకు లభించలేదని తెలిపింది.సౌదీ చమురు సంస్థపై ఇరాన్ డ్రోన్ దాడిసౌదీకి చెందిన చమురు సంస్థ అరామ్‌కోపై ఇరాన్ ఇరాన్ డ్రోన్ల దాడి భగ్నం చేశామన్న సౌదీ అరేబియాడ్రోన్ల శకలాలు కిందపడి మంటలు చెలరేగాయని సౌదీ అరేబియా వెల్లడి ఈ ఉదయం రాస్ తనురా రిఫైనరీపై డ్రోన్లతో దాడికి యత్నించి ఇరాన్‌రెండు డ్రోన్లను మధ్యలోనే అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సౌదీ అరేబియా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడిడ్రోన్లను అడ్డుకునే ఆపరేషన్‌లో కిందపడిన శకలాల కారణంగా స్వల్పస్థాయిలో మంటలు ఈ ఘటనలో ప్రాణనష్టం జరగలేదని సౌదీ అరేబియా రక్షణ శాఖ వెల్లడిడ్రోన్? దాడి తర్వాత రాస్ తనురా రిఫైనరీని తాత్కాలికంగా మూసివేసినట్లు సౌదీ వెల్లడి.

# పేదల ఇళ్లు కూల్చడం దుర్మార్గం

## రేవంత్ సర్కార్‌పై బండి సంజయ్ నిప్పులు



**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన హైడ్రా కూల్చివేతలు ఇంకా బఫర్ జోన్ నిబంధనలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం (మార్చి 1) హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గాంధీ విగ్రహం ఏర్పాటు పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం అత్యంత అమానుషమని మండిపడ్డారు. ఎఫ్‌టీఎల్ , బఫర్ జోన్ సాకుతో సామా న్యుల పొట్ట కొట్టవద్దని, ఒకవేళ పేదల ఇళ్ల జోలికి వస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చ రించారు.వివక్షపూరిత నిర్ణయాలు.. విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళనకూల్చివేతల విషయంలో ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. “పాతబస్తీలో ఒవైసీకి చెందిన కాలేజీని కూల్చడానికి పరీక్షలు అడ్డువచ్చాయని చెబుతున్న ప్రభుత్వం, ఖమ్మంలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల పరిస్థితిని ఎందుకు పట్టించుకోవడం లేదు?” అని ఆయన ప్రశ్నించారు. ఒకరి కళ్లలో ఆనందం కోసం మరొకరి జీవితాలను నాశనం చేయడం సరికాదని హితవు పలికారు. బాన్సువాడలో హిందువులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం.. రాహుల్ గాంధీపై విమర్శలు తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పటికే అంతర్గత పోరు మొదలైందని, మంత్రుల మధ్య సఖ్యత లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. “రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తున్నది కేవలం మూటల (నిధుల) కోసమే తప్ప ప్రజల కోసం కాదు” అని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు తమ పద్ధతి , బీజేపీ తలుచుకుంటే వారు బయట తిరగలేని పరిస్థితి వస్తుందని ఘాటుగా హెచ్చరి ంచారు. హిందువులంతా ఏకం కావాలిహిందూ సమాజానికి వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని బండి సంజయ్ పేర్కొన్నారు. పేదల ఇళ్లు కూల్చే ధైర్యం ఉంటే, ముందుగా చెరువులను ఆక్రమించిన బడా బాబుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయాలని డిమాండ్ చేశారు. సామాన్యులకు అన్యాయం జరిగితే బీజేపీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## తెలంగాణను నిలువు దోపిడీ చేస్తున్న కాంగ్రెస్

# నాయకులారా ఖబడ్దార్



**హైదరాబాద్ :** మేడిగడ్డ బ్యారేజీపై కుట్రలు చేసింది చాలదన్నట్టు, అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుతంత్రాలకు తెరతీశారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. నిబంధనలకు పాతరేసి ఏకంగా బ్యారేజీ కిందే భారీ ఎక్స్‌వేటర్లతో ఇసుక తవ్వకాలు జరపడం దుర్మాం మే కాదు.. అతిపెద్ద నేరమని అన్నారు. బ్యారేజీ సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూ డదన్న రూల్స్ ను బ్రేక్ చేసిన మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఏకంగా బ్యారేజీని బలహీనపరిచి బీఆర్ఎస్ పై బురదజల్లే పన్నాగాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ చేస్తున్న అరాచకపర్వాన్ని అన్నదాతలు క్షమించే ప్రసక్తే లేదని అన్నారు. నిబంధనలు తుంగలో తొక్కి అన్నారం బ్యారేజి పిల్లర్ల వద్ద ఇసుక తవ్వకాలు చేసి బ్యారేజీని రేవంత్ సర్కార్ ప్రమాదంలోకి నెడుతుందని తెలిపారు. ఇది ఖచ్చితంగా కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసే కుట్రే అని ఆరోపించారు. పట్టపగలే, నిస్సిగ్గుగా అన్నారం బ్యారేజ్ నుండి కాంగ్రెస్ నాయకుల ఇసుక మాఫియా ఇసుకను తోడేస్తుందని మండిపడ్డారు.ప్రజలు మీ భరతం పట్టే రోజు అతి దగ్గరలోనే ఉంది.. ఖబడ్దార్ అని హెచ్చరించారు.

## మోదీ అధ్యక్షతన సీసీఎస్ సమావేశం

### పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై చర్చ



**న్యూఢిల్లీ :** పశ్చిమ ఆసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులపై భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ-జఋూ చర్చించింది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరిలో రెండు రోజుల పర్యటన తర్వాత రాత్రి తొమ్మిదిన్నర గంటలకు దిల్లీ చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతి తర్వాత పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను ఈ భేటీలో సమీక్షించారు. జఋూ సభ్యులు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, ప్రధాని మోదీ ముఖ్య కార్యదర్శులు ్రాఖ మిశ్రా, శక్తికాంతదాస్, జఋూ అనిల్ చౌహాన్, కేబినెట్ కార్యదర్శి సోమనాథన్, విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్త్రీ ఈ సమావేశంలో పాల్గొన్నారు.పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, భారత్‌పై వాటి ప్రభావాన్ని ఉన్నతాధికారులు ఈ భేటీలో వివరించినట్లు సంబంధితవర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలోని భారతీయుల భద్రత, దుబాయ్, దోహా, ఆ ప్రాంతంలోని ఇతర విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన వారితోపాటు పరిస్థితులు మరింత విషమిస్తే ఎలా వ్యవహరించాలనే అంశంపై ప్రధానంగా చర్చించారు.

## బి హెచ్ ఈ ఎల్ డిపో నూతన డిపో మేనేజర్‌గా శ్రీ వి. మోహన్ రావు బాధ్యతల స్వీకరణ



**రామచంద్రపురం మార్చి: 02(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
బిహెచ్ఈఎల్ ఆర్‌టిసి డిపో నూతన డిపో మేనేజర్‌గా శ్రీ వి. మోహన్ రావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన మేనేజర్ బదిలీ కావడంతో, వారి స్థానంలో మోహన్ రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అధికారికంగా బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. డిపో పరిధిలోని బస్సుల రాకపోకలను క్రమబద్ధీకరించడం, సిబ్బంది సమన్వయంతో పనిచేసి సంస్థ లాభాల బాటలో నడిచేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మోహన్ రావు గారికి బిహెచ్ఈఎల్ డిపో అధికారులు, కార్మిక సంఘాల నేతలు మరియు సిబ్బంది పూలమాలలు, బొకేలతో ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు..

## చేగుంటలో వార్డు మెంబర్ల శిక్షణ కార్యక్రమం ప్రారంభం






**చేగుంట మార్చి 2 మెదక్ టుడే న్యూస్**
?చేగుంట మండలం, కమిషనర్ ఆదేశాల మేరకు చేగుంట మండల ప్రజాపరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్ నందు ఎంపీడీవో టి. చిన్నారెడ్డి ఆధ్వర్యంలో వార్డు మెంబర్ల రెండో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణలో భాగంగా మొదటి రోజు పంచాయతీ రాజ్ చట్టం-2018 తో పాటు వార్డు మెంబర్ల విధులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. రాబోయే ఐదు సంవత్సరాల పాలనలో ఈ శిక్షణ ఎంతో తోడ్పడుతుందని, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకుంటూ క్రమం తప్పకుండా హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విజయ్ పాల్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు బి. ప్రశాంత్, పి. బాలకృష్ణ, ఆర్. సంగమేశ్వర్, సిహెచ్. నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## పొలంపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి






**చేగుంట మార్చి 2 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలశీ పొలంపల్లి గ్రామ శివారులో, చేగుంట-మెదక్ ప్రధాన రహదారి పక్కన ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు సుమారు 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన మగ వ్యక్తిగా, భిక్షాటన చేస్తూ జీవించేవాడిగా పోలీసులు గుర్తించారు. రహదారి పక్కన పడుకొని ఉన్న స్థితిలో ఆ వ్యక్తి మరణించి ఉండటం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న చేగుంట సబ్ ఇన్స్పెక్టర్ చైతన్య కుమార్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస
ి నాబంధువుల ఆచూకీ దొరికినా వెంటనే చేగుంట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

## ఆకుల సుఖేందర్ జన్మదిన వేడుకలు: శాలువాతో ఘనంగా సన్మానం



**చేగుంట మార్చి 2 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం, ?చేగుంట 14వ వార్డు సభ్యుడు ఆకుల సుఖేందర్ జన్మదినం సందర్భంగా ఆయన స్నేహితులు ఘనంగా సన్మానం చేశారు. ఈ వేడుకలో భాగంగా సుఖేందర్‌ను శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అయిత నాగరాజు, న్యాలపల్లి సతీష్, అన్న శీమహేష్, సి లువేరు ప్రకాష్, దేవదాస్, నరేష్ తో పాటు పలువురు సన్నిహితులు పాల్గొని సందడి చేశారు. రాబోయే కాలంలో ఆయన మరిన్ని ప్రజా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# సుల్తాన్‌పూర్‌లో 'అక్రమ' జోరు.. టౌన్ ప్లానింగ్ 'మామూలు' తీరు!

- నిబంధనలు తుంగలో తొక్కి అదనపు అంతస్తుల నిర్మాణం
- అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా!
- బిల్డర్లతో చేతులు కలిపిన టౌన్ ప్లానింగ్ విభాగం?
- చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం





**అమీన్‌పూర్ మార్చి ; 02(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని సుల్తాన్‌పూర్ అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఇక్కడ భవన నిర్మాణ నిబంధనలు గాలికొదిలేసి, అదనపు అంతస్తుల నిర్మాణం యథేచ్ఛగా సాగుతోంది. సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకుంటేనే నోటీసులతో హడావుడి చేసే టౌన్ ప్లానింగ్ అధికారులు, భారీ బహుళ అంతస్తుల అక్రమ కట్టడాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అనుమతులు గోరంత.. నిర్మాణాలు కొండంత!**
సుల్తాన్‌పూర్ పరిధిలో వెలుస్తున్న చాలా భవనాలకు జీ+2 అనుమతులు తీసుకుని, వాస్తవానికి ఐదు నుంచి ఆరు అంతస్తుల వరకు నిర్మిస్తున్నారు. సెట్ బ్యాక్స్ నిబంధనలను బిల్డర్లు పూర్తిగా విస్మరిస్తున్నారు. ఇరుకైన రోడ్లు ఉన్న ప్రాంతాల్లో కూడా భారీ అపార్ట్‌మెంట్లు నిర్మించడంతో భవిష్యత్తులో ట్రాఫిక్, డ్రైనేజీ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అగ్నిమాపక యంత్రాలు కూడా వెళ్లలేని విధంగా కట్టడాలు సాగుతున్నా అధికారులు స్పందించకపోవడం వెనుక పెద్ద ఎత్తున 'మామూళ్ల' పంపిణీ జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**అధికారుల అండదండలతోనే బిల్డర్ల ఆగడాలు?**
టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు క్షేత్రస్థాయి అధికారులు బిల్డర్లతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు సమాచారం. నిర్మాణం ప్రారంభ దశలో ఉన్నప్పుడే ఫిర్యాదులు చేసినా, మొక్కుబడి నోటీసులతో కాలయాపన చేస్తూ నిర్మాణం పూర్తయ్యేలా సహకరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. బహుళ అంతస్తుల నిర్మాణం కోసం కావాల్సిన కనీస స్థల విస్తీర్ణం లేకపోయినా, తప్పుడు పత్రాలతో అనుమతులు పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ముప్పు పొంచి ఉన్నా.. పట్టించుకోరా?**
నిబంధనలకు విరుద్ధంగా కడుతున్న ఈ భవనాల నాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పునాదుల సామర్థ్యానికి మించి అదనపు అంతస్తులు వేయడం వల్ల భవనాలు కుప్పకూలే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు లేదా చిన్నపాటి భూకంపాలు వచ్చినప్పుడు ఈ అక్రమ కట్టడాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉంది.

**ఉన్నతాధికారులు స్పందించాలి..**
సుల్తాన్‌పూర్‌లో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించి ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధి.కార ులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు అతిక్ర మించిన భవనాలను వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## మార్చి 12న పటాన్‌చెరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 10, 11 తేదీలలో నియోజకవర్గ స్థాయి మహిళా క్రీడా పోటీలు
- జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా భారీ ఏర్పాట్లు





**పటాన్‌చెరు మార్చి: 02(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 12వ తేదీన పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరులోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

**25 ఏళ్ల సుదీర్ఘ సంప్రదాయం:**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలుగా పటాన్‌చెరు వేదికగా మహిళా దినోత్సవ వేడుకలను ఒక పండుగలా నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నదే తమ ఆకాంక్ష అని పేర్కొన్నారు.

**ఉత్సాహభరితంగా క్రీడా పోటీలు:**
వేడుకల్లో భాగంగా నియోజకవర్గ పరిధిలోని మహిళా ఉద్యోగులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మరియు మహిళా సంఘాల సభ్యుల కోసం ఈ నెల 10, 11 తేదీలలో మైత్రి మైదానంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మార్చి 12న జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

**భారీగా తరలిరావాలని పిలుపు:**
నియోజకవర్గంలోని మహిళామణులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ వేడుకలను దిగ్విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంఈఓ నాగేశ్వ రరావు నాయక్, నాయకులు సుధాకర్, రాములు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఐకేపీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా ఇస్నాపూర్: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

- ఇస్నాపూర్ మున్సిపాలిటీ తొలి పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెల్సీ అంజిరెడ్డి
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం
- పారిశుద్ధ్యం, మంచినీరు, విద్యుత్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం






**పటాన్‌చెరు: మార్చి: 02(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీని ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలోనే ఒక ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని పటాన్‌చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లకడారం వార్డు కార్యాలయంలో, మున్సిపల్ చైర్మన్ సుమలత అధ్యక్షతన నిర్వహించిన తొలి పాలకవర్గ సమావేశానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులను వారు ఘనంగా సన్మానించారు.

**అభివృద్ధికి నిధుల వరద:**
అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతనంగా 5 మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం ఇప్పటికే 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించామని వెల్లడించారు. ఈ నిధులను ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

**ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు:**
ప్రజలు పెట్టిన నమ్మకాన్ని కాపాడుతూ, రాబోయే ఐదేళ్ల కాలం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని కౌన్సిలర్లకు సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

**వేసవి సన్నద్ధతపై ఆదేశాలు:**
రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా మరియు విద్యుత్ సౌకర్యాల విషయంలో ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవి రెడ్డి, కమిషనర్ వెంకట కిషన్, కౌన్సిలర్లు మరియు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడకండి.. అండగా ఉంటాను..

- బంధం కొమ్ము రహదారి విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ..
- ఇల్లు యజమానులు నష్టపోకుండా సరికొత్త ప్రణాళిక..

**అమీన్ పూర్ : మార్చి 02(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
చందానగర్ జాతీయ రహదారి నుండి శ్రీదేవి థియేటర్, బంధం కొమ్ము మీదుగా అమీన్పూర్ డివిజన్ పరిధిలోని గాంధీ విగ్రహం వరకు చేపడుతున్న 150 అడుగుల రహదారి విస్తరణలో నష్టపోతున్న భూమి మరియు ఇళ్ల యజమానులు అధైర్య పడవద్దని.. వారికి పూర్తిస్థాయిలో అండగా ఉంటామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం ఉదయం బంధంకొమ్ము రహదారి విస్తరణ పనులపై అన్ని శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం రహదారి విస్తరణ పనులు చేపడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో బంధం కొమ్ము రహదారి పక్కనే చెరువు ఉండడం మూలంగా ఒకే వైపు 150 అడుగుల రహదారి విస్తరణ





మూలంగా ఇళ్ల యజమానులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని ఇటీవల స్థానిక ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకుని రావడం జరిగిందని తెలిపారు. రహదారి విస్తరణ మూలంగా ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా.. చెరువు సమీపంలో రహదారికి సమాంతరంగా బ్రిడ్జి నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు.ఇందుకు సానుకూలంగా స్పందించిన అధికారులు.. ఈ అంశాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైన పక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సైతం తీసుకెళ్లి ఇళ్ల యజమానులు నష్టపోకుండా వారికి భరోసా అందించారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఎమ్మార్వో వెంకటేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, మాజీ కౌన్సిలర్స్ కృష్ణ, రాజు, గోపాల్,వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ నక్కాకు రసాయన శాస్త్రంలో పీహెచ్.డీ. పట్టా

- గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ పరిశోధక విద్యార్థి ఘనత
- ఔషధాల భద్రతపై విశేష పరిశోధన

**పటాన్ చెరు మార్చి: 02 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి శ్రీనివాస్ నక్కా డాక్టరేట్ (పీహెచ్.డీ.) పట్టాకు అర్హత సాధించారు. 'లిక్విడ్ క్రోమాటోగ్రఫీ – మాస్ స్పెక్ట్రోమెట్రీ' (ఎల్సీ–ఎంఎస్) పద్ధతి ద్వారా, పర్యావరణహిత రసాయన శాస్త్ర (గ్రీన్ కెమిస్ట్రీ) సూత్రాలను పాటిస్తూ, ఔషధాలలో మలినాలను గుర్తించే ప్రక్రియపై ఆయన చేసిన పరిశోధనకు గాను ఈ గౌరవం దక్కింది.
పరిశోధన ముఖ్యాంశాలు:ఈ పరిశోధనకు మార్గదర్శకత్వం వహించిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు సోమవారం వివరాలను వెల్లడించారు. ఆధునిక ఔషధ తయారీలో ప్రధాన సమస్యగా మారిన 'నైట్రోసమైన్' అనే మలినాలను అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించడం, వాటిని నియంత్రించడంపై శ్రీనివాస్ పరిశోధన సాగింది.బ్యాక్టీరియా నిరోధక మందులు (సిప్రోఫ్లోక్సాసిన్, మోక్సిఫ్లోక్సాసిన్).
నొప్పి నివారణ మందులు (అసెక్లోఫెనాక్, మెఫెనామిక్ యాసిడ్).ప్రోస్టేట్ సమస్యలకు వాడే మందులు (టామ్సులోసిన్).వంటి కీలక ఔషధాలలో మలినాలను



లెక్కించేందుకు ఆయన అత్యాధునిక సాంకేతిక పద్ధతులను అభివృద్ధి చేశారు. ఈ పరిశోధన సురక్షితమైన ఔషధాల తయారీకి మరియు ప్రభుత్వ నియంత్రణ సంస్థల ప్రమాణాలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.హర్షం వ్యక్తం చేసిన గీతం యాజమాన్యం: శ్రీనివాస్ నక్కా సాధించిన ఈ విజయానికి గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం మరియు ఇతర అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించే దిశగా గీతం సంస్థ చేస్తున్న కృషికి ఈ పరిశోధన ఒక నిదర్శనమని వారు కొనియాడారు.

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టులో విచారణ


కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరుగుతోంది. కేసీఆర్, హరీశ్?రావు, ఎస్కే జోషి, స్మితా సబర్వాల్ పిటిషన్లపై ఇవాళ ఉన్నత న్యాయస్థానం విచారణచేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపిస్తుండగా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తరఫున నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తున్నారు.ఎలాంటి ఆధారాలు లేకుండా కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసి రాజకీయ వ్యూహంలో భాగంగా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గతంలో కేసీఆర్ హరీశ్‌రావులు ఇచ్చిన పిటిషన్‌లో పేర్కొన్నారు. నివేదిక కాపీని అందజేయకుండా ప్రభుత్వం మీడియా ప్రచురణలకు ఇవ్వడంలో దురుద్దేశపూరితం, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని




ఆరోపించారు.కాళేశ్వరం లోపాలకు నేను ఏ విధంగా బాధ్యుడినో చెప్పాలి : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైనటువంటి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో డిజైనింగ్ లోపాలు, ప్రణాళిక సహా అన్నింటికీ సీఎంగా తానే బాధ్యుడినంటూ జస్టిస్ ఘోష్ కమిషన్ ఏవిధంగా నిర్ణయించిందో చెప్పాల్సినటువంటి అవసరం ఉందంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల హైకోర్టుకు నివేదించారు. ప్రభుత్వం అందించినటువంటి రికార్డుల ఆధారం గా నిర్ణయించడమనేది సరికాదని ఆయన అన్నారు. అందుకు సంబంధించిన అన్ని ఆధారా లను సమర్పించి వివరణ తీసుకున్నాక మాత్రమే ఓ నిర్ధారణకు రావాల్సి ఉంటుందన్నారు. అయితే కమిషన్ ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిందని హైకోర్టుకు నివేదించారు. సాక్షిగా పిలిచి దోషిగా అభియోగాలు మోపారని కేసీఆర్ తన పిటిషన్‌లో తెలిపారు. తన ప్రతిష్ఠ దెబ్బతీసేలా నిర్ధరణ ఉన్నప్పుడు, అందుకు గల ప్రాతిపదికను సెక్షన్ 8 బీ, సీ ప్రకారం నోటీసు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. పిటిషనర్‌కు వ్యతిరేకంగా అభియోగాలు మోపిన వారి వివరాలు చెప్పలేదన్న కేసీఆర్, వాంగ్మూలం ఇచ్చిన వారిని ప్రశ్నించే అవకాశం ఇవ్వలేదన్నారు.

# రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన వేళ.. కల్వకుంట్ల కవిత ట్వీట్

**వికారాబాద్ :** వికారాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో ప్రసంగించేందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ .. ఇవాళ తెలంగాణకు వచ్చారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రాహుల్ గాంధీకి కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో హాజరయ్యారు. అయితే రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చిన వేళ.. తెలంగాణ జాగృతి చీఫ్ కవిత.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు సంధించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుపై రాహుల్ గాంధీని కవిత నిలదీశారు.
ఈ సందర్భంగా ట్వీట్ చేసిన కవిత.. 'రాహుల్ గాంధీ జీ.. దో లాక్ నౌకరీ దో. తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మీరు హామీ ఇచ్చి రెండున్నరేళ్లు అయ్యింది. డీసీసీ అధ్యక్షుల శిక్షణ కోసం తెలంగాణకు వస్తున్న రాహుల్ గాంధీ గారు మీ హామీని నమ్మి శిక్ష అనుభవిస్తున్న మా నిరుద్యోగుల గోడు మీకు పట్టదా. మీ పార్టీ గద్దెనెక్కడానికి నిచ్చెనమెట్లుగా నిలిచిన యువత ఆశలు, ఆకాంక్షలను



చిదిమేశారు. ఉద్యోగాలు ఇవ్వాలని అడిగితే పోలీసులతో అణచివేస్తున్నారు. యూత్ డిక్లరేషన్ బోగస్‌గా మారింది.. జాబ్ క్యాలెండర్ పత్తా లేదు.. కాంగ్రెస్ అంటేనే మోసం.. వంచన అనే మాటను నిలబెట్టుకున్నారు. రాహుల్ జీ ఇది పోరాటాల పురిటిగడ్డ.. మీ హామీని నిలబెట్టుకోండి.. 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీని అమలు చేయించండి' అని పేర్కొన్నారు.ఇక పీఏసీ సమావేశంలో రాహుల్ గాంధీతోపాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.. ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలతో పాటు ముఖ్యనేతలు హాజరయ్యారు.కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు.. పార్టీ చేపట్టే కార్యక్రమాల నిర్వహణ సహా అనేక అంశాలపై హస్తం పార్టీ నేతలతో రాహుల్ గాంధీ చర్చలు జరిపారు. గత 9 రోజులుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ట్రైనింగ్ శిబిరం కొనసాగుతోంది. ఇవాళ జరిగే ముగింపు సమావేశంలో డీసీసీ అధ్యక్షులు, నేతలకు రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేయనున్నారు.

# బీవీఆర్ఐటీలో ఇంటర్వ్యూలు.. విద్యా పర్యటనలో పాల్గొన్న విద్యార్థులు

**నర్సాపూర్, మార్చి2:** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో సోమవారం బాజా సే ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎం బాజా సే ఇండియా– 2026 పోటీలు ఫిబ్రవరి 25 నుండి మార్చి 3 వరకు బీవీఆర్ఐటీ కళాశాలలో నాలుగు రోజుల పాటు విజయవంతంగా జరిగాయి. ఐదవ రోజు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన హెచ్ ఆర్ మీట్ కార్యక్రమం సోమవారం ప్రత్యేకంగా నిలిచింది. ఈ కార్యక్రమం ద్వారా పరిశ్రమలతో విద్యార్థుల అనుసంధానం మరింత బలపడింది.దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతిభావంతులైన యువ ఇంజనీర్లతో నేరుగా మమేకమయ్యేందుకు ప్రముఖ సంస్థలైన జేకే టయర్స్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, టీవీఎస్ మోటర్ కంపెనీ, వర్రోక్ నియామక ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ




ప్రక్రియలో భాగంగా ఎం బాజాలో పాల్గొన్న ప్రతీ విద్యార్థి బాజా అస్సెస్మెంట్ టెస్ట్ అనే సమగ్ర పరీక్షకు హాజరయ్యారు. ఇందులో సాధించిన ప్రతిభ ఆధారంగా సంస్థలు అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసి, ఆన్లైన్ అంచనాలు, గ్రూప్ డిస్కర్షన్, సాంకేతిక ఇంటర్వ్యూలు, హెచ్ ఆర్ ఇంటర్వ్యూల వంటి పద్ధతి ద్వారా నియామక దశలకు ఆహ్వానించాయి.ఈ సందర్భంగా బాజా సే ఇండియా జాయింట్ కన్వీనర్ డా. మురళీకృష్ణ మాట్లాడుతూ.. హెచ్ఎర్ మీట్ ద్వారా పరిశ్రమలకు ఇప్పటికే పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిద్ధమైన ప్రతిభావంతులైన అభ్యర్థుల సమూహం లభించిందని వెల్లడించారు. ఫలితంగా విద్యార్థులు ఉద్యోగావకాశాల కోసం మాత్రమే కాకుండా నేరుగా పరిశ్రమల్లో అన్నారు.విద్యార్థుల విద్యా పర్యటన..నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలను శివంపేట్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 100 మంది విద్యార్థులు అలాగే 10 మంది అధ్యాపకులు సోమవారం సందర్శించారు. విద్యార్థులను రెండు బ్యాచులుగా విభజించి తద్వారా ప్రతీ విద్యార్థికి అన్ని సౌకర్యాలను సమగ్రంగా వీక్షించే అవకాశం లభించింది.

# రాజ్యసభ సీటు మాదిగలకు కేటాయించాలి : మంద కుమార్ మాదిగ




**హనుమకొండ చౌరస్తా, మార్చి 2:** తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సీటు మాదిగలకు కేటాయించాలని ఎమ్మెస్పీ జాతీయ నేత మందకుమార్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యసభ సీటును మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగల ఎమ్మెల్యే స్థానాలు తగ్గించి మాలలకు కేటాయించడం మాదిగ జాతికి తీరని అన్యాయం కాంగ్రెస్ పార్టీ చేసిందన్నారు.అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో మూడు పార్లమెంటు స్థానాలు ఉంటే ఒకటి కూడా మాదిగలకు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ మాదిగ జాతిని మోసం చేసిందన్నారు. నామినేట్ పదవులల్లో మాదిగలకు అవకాశాలు రావాలని ముఖ్యమంత్రి ఇప్పటికైనా మాదిగ జాతికి తీరని అన్యాయం చేయకుండా రాజ్యసభ సీట్లు వెంటనే కేటాయించాలని లేని పక్షంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటానికి సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా బిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, రాష్ట్ర నాయకులు మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సుంచు మాదిగ పాల్గొన్నారు..

# 'మాతృదేవోభవ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



**కోదాడ, మార్చి 02 :** మాతృదేవోభవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని ఆర్.ఎస్.వి ఫంక్షన్ హాల్‌లో యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మాతృదేవోభవ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. శిబిరంలో సుమారు 300 మందికి పైగా రోగులకు గుండె, ఎముకల వ్యాధులకు నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వాడపల్లి రంగమ్మ, గుండపునేని నాగేశ్వరరావు, పందిరి నాగిరెడ్డి, సొసైటీ కోదాడ అధ్యక్షురాలు పబ్బా గీతా దేవి, కార్యదర్శి ఓరుగంటి రమాదేవి, కోశాధికారి ఇమ్మడి సతీష్ బాబు, గౌరవ రాచర్ల కమలాకర్, ఉపాధ్యక్షులు బొగ్గారపు రేఖా రాణి, మంజుల, స్వాతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# రేవంత్ తప్పులు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా ?

**హైదరాబాద్ :** యూపీలో మాదిరిగానే తెలంగాణాలో కూడా సీఎం రేవంత్ రెడ్డి పాలనలో బుల్డోజర్ రాజ్యం నడుస్తుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు . రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పేద ప్రజల ఇళ్లను నేలమట్టం చేస్తున్న విషయం రాహుల్ గాంధీ కి తెలియదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అరాచకాలపై మౌనంగా ఎందుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు .గత రెండున్నర ఏళ్లలో రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తున్నారు.. వెళ్తున్నారు.రాష్ట్ర అభివృద్ధి మాత్రం ముందుకు పోవటం లేదని ఆరోపించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో అధికారులు పేదల ఇండ్లను కూల్చివేయడం తో ప్రస్తుతం గాజాలా మారిందని పేర్కొన్నారు.యుద్ధం జరిగితే ఎలా ఉంటుందో ఇప్పుడు వెలుగుమట్ల పరిస్థితి అలానే ఉందని అన్నారు.రాహుల్ గాంధీ ఖమ్మం వెళ్లి రోడ్డున పడ్డ ప్రజల దీనస్థితిని తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల కోసం పార్లమెంట్‌లో రాహుల్ కొట్లాడాలని కోరారు. పేద ప్రజల ఇళ్లు కూల్చిన చోటే కట్టించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందని అన్నారు.




## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు బెయిల్ మంజూరు

**మంచిర్యాల :** అక్రమ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ( కు బెయిల్ ( మంజూరయ్యింది. కోర్టు రూ. 25వేల పూచీకత్తుతో, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సోమవారం ఉదయం బాల్క సుమన్ కస్టడీ పిటిషన్‌ను వాయిదా వేసిన కోర్టు సాయంత్రం బెయిల్ మంజూరు చేసింది.అధికార కాంగ్రెస్ పార్టీ బాల్కసుమన్‌కు బెయిల్ రాకుండా అడుగడుగునా అడ్డుపడింది. బెయిల్ పిటిషన్‌పై మంచిర్యాల కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పోలీసులతో జిల్లా కోర్టులో అప్పీల్ చేయించింది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన జిల్లా కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది.ఇక బెయిల్ పిటిషన్‌పై లంచ్ తర్వాత తీర్పును వెల్లడించింది. గత 15 రోజులుగా ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యేను బీఆర్ఎస్ అగ్ర నాయకులు పరామర్శించి ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ప్రశ్నించారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలుపొందింది. అయితే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ అడ్డుకుని చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌తో పాటు మరో 20 మందిపై అక్రమ కేసులు బనాయించి జైలులో బంధించింది.



మెదక్ టుడే
MEDAK TODAY
RNI NO : TELTEL/2023/88524
మంగళవారం, 03 మార్చి 2026

# శ్రీకాకుళం జిల్లాలో ఏసీబీ దాడులు




**శ్రీకాకుళం, మార్చి 2 :** శ్రీకాకుళం జిల్లాలో ఏసీబీ అధికారులు (సోమవారం) విస్తృత తనిఖీలు చేపట్టారు. డీసీసీబీ కాలనీలోని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గడ్డి బాలముకుందం ఇంట్లో విస్తృత సోదాలు నిర్వహించారు. జనవరి 28వ తేదీన కంచిలి ప్రాంతంలో బాలముకుందం వార్డెన్ల నుంచి రూ. 1.84 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనపై ఫిర్యాదులు రావడంతో ఏసీబీ అధికారులు చర్యలు చేపట్టారు.విద్యార్థుల నుంచి రూ.5లు వసూలు..బీసీ హాస్టల్లో నివసిస్తున్న విద్యార్థుల నుంచి నెలవారీగా రూ.5ల చొప్పున వసూలు చేస్తున్నట్లు బాలముకుందంపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఫిర్యాదుల కారణంగా ఏసీబీ అధికారులు ఆయన నివాసాలు, కార్యాలయాల్లో విస్తృత సోదాలు నిర్వహించారు. ఏసీబీ సోదాల సమయంలో నివాసాల నుంచి సంబంధిత డాక్యుమెంట్లు, రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# ప్రజల మనసు గెలవడమే లక్ష్యం.. పబ్లిక్ పర్సెప్షన్‌పై ముఖ్యమంత్రి దిశానిర్దేశం



**అమరావతి:** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు తన పాలనలో 'రియల్-టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ 'పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్' ) ప్రజాభిప్రాయాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుం కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేశారు. సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలి. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి వెళ్లి అధ్యయనం చేసిరావాలి. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి' అని అన్నారు.

# కాకినాడ సీజన్ 5 రెస్టారెంట్‌లో దారుణం

**కాకినాడ, మార్చి 2:** కాకినాడలో సీజన్ 5 రెస్టారెంట్ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఈ రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు సహా రెవెన్యూ, మున్సిపల్, హెల్త్, సివిల్ సప్లైస్ విభాగాల అధికారులు సోమవారం ఆకస్మికంగా దాడులు చేశారు. రెస్టారెంట్‌లో వినియోగదారులకు నిల్వ చేసిన మాంసం వడ్డిస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో కిలోలకొద్దీ చికెన్, ఫ్రై శాంపిల్స్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. నిల్వ మాంసం కావడంతో అన్నింటినీ సీజ్




చేసినట్లు తెలిపారు.నిల్వ మాంసాన్ని కస్టమర్లకు ఎలా వడ్డిస్తారని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రెస్టారెంట్‌లో అపరిశుభ్ర వాతావరణం ఉండటాన్ని కూడా అధికారులు తప్పుబట్టారు. ఈ చర్యలతో రెస్టారెంట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇటీవల ప్రత్తిపాడులో జంతుకొవ్వుతో నూనె తయారు చేస్తూ ఓ ముఠా పట్టుబడిన ఘటన మరువకముందే కాకినాడ రెస్టారెంట్ నిర్వాహకుల మోసం వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. కాకినాడలోని అనేక హోటల్స్‌లో తరచూ ఆహార కల్తీ జరుగుతోందనే ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు చేస్తున్నారు.

# తిరుపతిలో దారుణం.. బంగారు నగల కోసం వృద్ధురాలిని




**తిరుపతి, మార్చి 2:** తిరుపతిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. బంగారు నగల కోసం వృద్ధురాలిని దుండగులు హత్య చేశారు. వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరవపల్లె వీధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతురాలు కె.లక్ష్మమ్మగా(67) గుర్తించారు. టీటీడీలో రిటైర్డ్ అయిన ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా ఈ ఘటన జరిగింది. దుండగులు ఆమె గొంతును నులిమి, ఆ తర్వాత దిండుతో అదిమి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఆమె ఒంటిపై ఉన్న 100 గ్రాములకు పైగా బంగారు నగలను కాజేసి పరారయ్యారు.సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. హత్యకు గల ఆధారాలను క్లూస్ టీంతో కలిసి వెస్ట్ పోలీసులు సేకరించారు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. సొంత మనవడే ఈ హత్యకు విచారణలో పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ హత్యకు సంబంధించి ఇప్పటికే ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# వినూత్న బోధనలో ఆ టీచర్ ఆదర్శంగా నిలిచారు

**అమరావతి, మార్చి2 :** సృజనాత్మక విద్యా బోధనతో విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతున్న శ్రీకాకుళం జిల్లా టీచర్ కూర్మాన అరుణ కుమారిని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. జి.సిగడాం మండలం పున్నాం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న అరుణకుమారి వినూత్న పద్ధతులతో పాఠాలను బోధిస్తున్నారని కొనియాడారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేశ్ ట్వీట్ పెట్టారు. అరుణకుమారి టీచర్ సంప్రదాయ బోధనకు భిన్నంగా సృజనాత్మక పద్ధతులను అనుసరిస్తున్నారని మెచ్చుకున్నారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలతో మాత్రమే కాకుండా విద్యార్థులకు అర్థమయ్యేలా బొమ్మలు రూపొందించడం, పాఠాలకు సంబంధించిన షార్ట్ ఫిల్మ్స్ తయారు చేయడం, వర్కింగ్ మోడల్స్ ద్వారా ప్రాక్టికల్ అవగాహన కల్పించడం, పిల్లలతో ప్రత్యక్ష కార్యకలాపాలు చేయించడం వంటి పద్ధతులను అమలు చేస్తున్నారని ప్రశంసించారు.విద్యార్థుల్లో ఆసక్తి.ఈ విధానం వల్ల విద్యార్థులు సులభంగా పాఠాలను అర్థం చేసుకుంటున్నారని మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా చిన్న తరగతుల పిల్లల్లో నేర్చుకునే ఆసక్తి పెరుగుతోందని చెప్పుకొచ్చారు. గ్యారంటీడ్




ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్, రాష్ట్ర, జాతీయ స్థాయి విద్యా శిక్షణల్లో కేఆర్పీగా, మాడ్యూల్ రచయితగా, ఈ--కంటెంట్ సృష్టికర్తగా అరుణ కుమారి టీచర్ ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆధునిక, సృజనాత్మక బోధన సాధ్యమేనని ఈ టీచర్ నిరూపించారని తెలిపారు. పరిమిత వనరులతో కూడా నాణ్యమైన విద్య అందించవచ్చని ఆమె చూపించారన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడం, పాఠశాలపై ఆసక్తి కల్పించడం, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నారని కొనియాడారు. అరుణకుమారి టీచర్ గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగు.వినూత్న డిజిటల్ బోధన చేస్తూ బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. టీచర్ కృషి వల్ల విద్యార్థుల్లో ప్రాథమికంగా చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు మెరుగుపడుతున్నాయని వివరించారు. ఆమె రాష్ట్రానికి స్ఫూర్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యాన్ని సాధించడంలో ఇలాంటి టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. టీచర్ సృజనాత్మక బోధన విధానం ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం విద్యారంగంలో నాణ్యత పెంపు కోసం పలు సంస్కరణలు చేపడుతోందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అరుణకుమారి వంటి ఉపాధ్యాయులు విద్యా వ్యవస్థకు బలంగా నిలుస్తున్నారని మెచ్చుకున్నారు. అరుణకుమారి లాంటి టీచర్ల వల్ల ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతోందని చెప్పుకొచ్చారు. విద్యార్థుల హాజరు పెరుగుతోందని, నేర్చుకునే సామర్థ్యం మెరుగుపడుతోందని, ప్రభుత్వ విద్యా సాధ్యమవుతున్నాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# కొడాలి నానికి ఆ భయం పట్టుకుంది: వెనిగండ్ల రాము

**కృష్ణా జిల్లా, మార్చి 2:** కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి కొడాలి నాని చేసిన వ్యాఖ్యలపై గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. వైసీపీ ఇన్‌ఛార్జ్ పదవి నుంచి తొలగిస్తారనే భయంతో నాని బిక్కుబిక్కుమంటూ మాటలు చెబుతున్నారని ఆయన విమర్శించారు. పాపాలు, తప్పులు చేసిన వారెవరైనా జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. జైల్లో గుట్కాలు ఉంటాయా, సౌకర్యాల సంగతి తెలుసుకునేందుకే అంబటి రాంబాబును కలిశారని రాము ఎద్దేవా చేశారు. చేసిన తప్పులు, పాపాలు బయటపడతాయనే భయం నానిని పట్టుకుందని వెనిగండ్ల రాము అన్నారు. వంద రోజుల జైలు టైం కూడా పెట్టుకున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.నానిని లేదా ఎవరినైనా అన్యాయంగా అరెస్ట్ చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం ముందు సమానమేనని, టీడీపీ కార్యకర్త అయినా అదే



వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. సప్త సముద్రాలు దాటి తమ సంగతి చూడాల్సిన అవసరం లేదని.. గుడివాడ ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెబితే చాలని రాము సూచించారు. పరామర్శించి అటునుంచి అటే వెళ్లిపోయారని, గుడివాడ ప్రజలకు మొహం చూపించే సాహసం కూడా లేదని వెనిగండ్ల రాము విమర్శించారు.నిజమేంటో ప్రజలకు తెలుసునని, సొల్లు చెప్పుకుంటూ పోతే ఈసారి డిపాజిట్లు కూడా రావని ఆయన హెచ్చరించారు. ప్రజలు పూర్తిగా మర్చిపోయిన వ్యక్తి గురించి మాట్లాడడం వ్యర్థమని రాము అభిప్రాయపడ్డారు. ప్రతిపక్ష హోదా గురించి తప్పితే, ప్రజల గురించి వైసీపీ వారికి ఏమీ పట్టదని విమర్శించారు. గుడివాడ నియోజకవర్గంలో వరదలు వచ్చినప్పుడు ఎక్కడికి పోయారని.. ఒక్కరికైనా సహాయం అందించారా అని ప్రశ్నించారు. 2019లాగా ఇక ప్రజలు మోసపోరని వెనిగండ్ల రాము

# గరికపాటి సలహాలు మాకు అవసరం లేదు.. కమలానంద భారతి ధ్వజం

**విజయవాడ, మార్చి 2:** ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగునాడుగా మార్చాలని ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలపై భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి తీవ్రంగా స్పందించారు. తాజా వివాదంపై ఆయన (సోమవారం) వీడియో విడుదల చేశారు. వింత పోకడలు, వింత ఆలోచనలు ఎందుకు వస్తున్నాయో తెలియడం లేదని ధ్వజమెత్తారు. మహా సంకల్పంలో అంగ, వంగ, కళింగ, సౌరాష్ట అని చెప్పుకునే క్రమంలో కేరళ, ద్రవిడ, ఆంధ్రా అని వస్తుందని వివరించారు. రామాయణ కాలం నుంచి ఇక్కడ ఒక జాతి ఉందని.. దానికి ఆంధ్రా అనే పేరు ఉందని ప్రస్తావించారు.ఎన్టీఆర్ ఆంధ్రుల ఆత్మగౌరవం.ఆంధ్ర మహాభారతం, ఆంధ్రభాగవతం రాశారని కమలానంద భారతి తెలిపారు. అడిగి వారు లేరని తెలివి, పాండిత్యం, అధిక ప్రసంగం ఎక్కువయ్యి తెలుగు భాగవతం, తెలుగు భారతం జరుపుకుంటున్నారని అన్నారు. మాజీ సీఎం నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ పెట్టారని.. ఆయన నినాదం



ఆంధ్రుల ఆత్మగౌరవమని ఉద్ఘాటించారు. రాష్ట్రాల విభజన జరిగిందని.. మానసికంగా అందరం కలిసే ఉన్నామని చెప్పుకొచ్చారు. సంస్కృతాంధ్ర అనాలి తప్ప.. సంస్కృత తెలుగు అనేది దుష్ట సమాసమని నన్నయభట్టు చెప్పారని ప్రస్తావించారు. శాతవాహనులు, అనేకులు ఆంధ్రులు అనే చదువుకున్నారని తెలిపారు. ఆంధ్ర అనే పదం అనకూడదనేలా కొందరు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు.గరికపాటికి ఆ నైతిక బాధ్యత లేదు.గరికపాటి ఆంధ్రకు రారని.. తెలంగాణలో స్థిరపడ్డారని కమలానంద భారతి గుర్తుచేశారు. వేసవి, సంక్రాంతి సెలవులకు, వచ్చి 5 కోట్లు మంది ఎలా ఉండాలో చెప్పే నైతిక బాధ్యత ఆయనకు లేదన్నారు. ఏపీ అంటే తెలుగు కాదా అని ప్రశ్నించారు. నాడు, ప్రదేశ్ అనేది సంస్కృత పదం కాదా అని నిలదీశారు. ఇలాంటి మేధావులే ఏపీకి మద్రాస్ రాకుండా చేశారని ఆగ్రహించారు. నాలుగు జిల్లాలకు రాయలసీమ అనే పేరు పెట్టే పరిస్థితులు తెచ్చారని తెలిపారు. విచ్ఛిన్నకర పరిస్థితులు ఎందుకు తెస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రాంతం, తమ బతుకులు ఎలా ఉండాలో తమకు తెలుసునని చెప్పుకొచ్చారు. ఎక్కడో ఉండే గరికపాటి ఇక్కడికి వచ్చి సలహాలు ఇవ్వొద్దని హితవు పలికారు. తాము ఆంధ్రప్రదేశ్ ప్రజలుగా ఉంటామని.. ఎవ్వరు వేలు పెట్టొద్దని కమలానంద భారతి సూచించారు.

# గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారి కోసం చర్యలు

**అమరావతి, మార్చి 2 :** గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ ఎంఆర్ఐ సాధికారిత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఏపీ ఎన్నార్టీ కో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని కోరారు.తెలుగు వారి క్షేమం కోసం చర్యలు..సోమవారం అమరావతి వేదికగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. ఇజ్రాయిల్ - ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం కారణంగా, గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారి క్షేమం కోసం నిరంతరం తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పుకొచ్చారు. వారిని తిరిగి రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.వారి వసతి, భద్రతపై చర్యలు..ఆయా దేశాల్లో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా కొన్ని విమానాశ్రయాల్లోని ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి



కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, తాము ఎప్పటికప్పుడూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్నార్టీ) ద్వారా ఇబ్బందుల్లో ఉన్న ప్రవాసాంధ్రులకు అవసరమైన సహాయం చేసేందుకు గానూ చర్యలు చేపడుతున్నామని వివరించారు. గల్ఫ్ దేశాల్లోని ఏపీ ఎన్నార్టీ కోఆర్డినేటర్లను అప్రమత్తం చేసి, స్థానికంగా ఉన్న తెలుగు కుటుంబాల సహకారం తీసుకోవాలని సూచించారు. వారి ద్వారా తాత్కాలిక వసతి, భద్రత, అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.కోఆర్డినేటర్లతో సంప్రదింపులు..ఏపీ ఎన్నార్టీ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని మానిటర్ చేస్తూ, కోఆ ర్డినేటర్లతో సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వివరించారు. స్థానికంగా ఉన్న ఇండియన్ ఎంబసీ సేవలను, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు తమ వివరాలను ఏపీ ఎన్నార్టీఎస్ 24/7 హెల్ప్‌లైన్ 0863 - 2340678, వాట్సాప్: 091 85000 27678 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. వీటితోపాటు ఈమెయిల్: అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు వెంటనే సంప్రదించి సహాయం పొందాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# రాజధాని నిర్మాణ పనుల ఆలస్యంపై మంత్రి నారాయణ ఆగ్రహం

**అమరావతి :** ఇన్నర్ రింగ్ రోడ్డులో తన స్థలం కూడా పోయిందంటూ ఏపీ మంత్రి నారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగు రోడ్డు వ్యహారంలో అక్రమాలు జరిగాయని తనపై కూడా కేసులు పెట్టారని.. కానీ తాను 2001లో కొనుగోలు చేసిన 60 సెంట్ల నా సొంత స్థలం కూడా తన స్థలం ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్‌లో పోయింది అన్నారు. విజయవాడ సమీపంలో ఈడుపుగల్లులో ఉన్న తన స్థలం మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్తుంది అన్నారు. 'మా వాళ్లు ఆ స్థలంలో బిల్డింగ్ నిర్మాణం కోసం వెళ్తే సీఆర్డీయే వాళ్లు మీ స్థలం లేదని మా వాళ్లతో చెప్పారు. కానీ గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమాలు జరిగాయని ప్రచారం చేశారు.. ప్రస్తుతం కోర్టులో కేసు ఉంది కాబట్టి.. ఎలాంటి కామెంట్స్ చేయను' అన్నారు నారాయణ.మంత్రి నారాయణ అమరావతిలోని నేలపాడులో పర్యటించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారులు టైప్ -1,టైప్ -2,గ్రూప్ - డి ఉద్యోగుల క్వార్టర్లను పరిశీలించారు. అమరావతిలో భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని.. మొత్తం 4026 ఇళ్లకు అంతర్గత పనులు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో పనులు నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులు వచ్చాయని..రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు ఆలస్యం చేస్తున్నారంటూ కాంట్రాక్టు సంస్థలపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. (సోమవారం) రాజధాని ప్రాంతంలో మంత్రి పర్యటించారు. నేలపాడు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్



అధికారుల క్వార్టర్స్, గ్రూప్-డి ఉద్యోగుల క్వార్టర్స్‌తో పాటు వివిధ నిర్మాణాలను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయలేకపోతే వెళ్లిపోవాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులపై మంత్రి నారాయణ అసహనం వ్యక్తం చేశారు.షాపూర్ జీ పల్లోంజీ కన్స్ట్రక్షన్ సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులను వెంటనే పంపించేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆ సంస్థ యాజమాన్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికినుల ఆలస్యంపై సంజాయిషీ ఇవ్వాలని మంత్రి నారాయణ ఆదేశించారు. రాజధాని నిర్మాణాలు వేగంగా, నాణ్యతగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు మంత్రి సూచించారు. వర్షాల వల్ల గత నవంబర్ వరకు పనులు జరగలేదన్నారు. అమరావతిలో ప్రైవేట్ సంస్థలు నిర్మాణ పనులు కూడా చాలా వరకూ జరుగుతున్నాయని.. టార్గెట్ ప్రకారం పనులు చేయకపోవడంపై షాపూర్జీ - పల్లోంజి మేనేజ్మెంట్‌తో మాట్లాడుతున్నట్లు తెలిపారు.అమరావతిలో అభివృద్ధి పనులు ఆలస్యం చేస్తున్నారంటూ కొన్ని కాంట్రాక్ట్ సంస్థలపై మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. టార్గెట్ పెట్టుకుని పనులు చేస్తున్నప్పుడు అందుకు తగినవిధంగా నిర్మాణ సంస్థలు పనులు చేయాల్సిందే అన్నారు. ఒకవేళ పనులు చేయలేకపోతే వెళ్లిపోవచ్చని తేల్చి చెప్పారు. అమరావతిపై వైఎస్సార్‌సీపీ నేతలు చేసే ఆరోపణల్ని ప్రజలు నమ్మరన్నారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో గేమ్ ఆడకుండా ఉండుంటే అమరావతిలో పనులన్నీ ఓ కొలిక్కివచ్చేవి అన్నారు. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టామని.. మూడు నెలల్లో రోడ్ల పనులు పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నట్లు తెలిపారు. రాబోయే మూడేళ్లలో పరిపాలనకు సంబంధించిన భవనాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు మంత్రి నారాయణ.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..